క్లుప్తంగా

మొక్కలు నాటే పనుల పరిశీలన



గోతులను పరిశీలించి సూచనలు చేస్తున్న మున్సిపల్ చైర్మన్ అశోక్‌గౌడ్

నర్సాపూర్: వనమహోత్సవం కింద మొక్కలు నాటే పనులను మున్సిపల్ చైర్మన్ అశోక్‌గౌడ్ ఆదివారం పరిశీలించారు. పట్టణంలోని రాయరావు చెరువు వద్ద మొక్కలు నాటేందుకు గోతులు తవ్వకం పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గోతులు సరిపడా తీయాలని మొక్కలు సరైన రీతిలో నాటాలని, నాటిన మొక్కలను కాపాడేందుకు అన్ని చర్యలు తీసుకోవాలని మున్సిపల్ సిబ్బందికి సూచించారు. అనంతరం ఒకటవ వార్డు పరిధిలో పర్యటించారు. ఆయన వెంట పలువురు మున్సిపల్ శానిటర్ ఇన్స్‌పెక్టర్ మురళీ, ఎన్విరాన్‌మెంటల్ ఇంజనీర్ శ్రీకాంత్ తదితరులు ఉన్నారు.

కార్మికుడి కుటుంబాన్ని ఆదుకోవాలి



మహేష్‌ను పరామర్శిస్తున్న ఆసిఫ్

శివ్వంపేట(నర్సాపూర్): విధి నిర్వహణలో గాయపడ్డ కార్మికుడి కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామ పంచాయతీ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి ఆసిఫ్ అన్నారు. మండల పరిధిలోని పెద్దగొట్టిముక్ల గ్రామానికి చెందిన పంచాయతీ కార్మికుడు మహేశ్ గత నెల 23న విద్యుత్ స్తంభాలపై వీధిలైట్లు బిగిస్తున్న క్రమంలో ప్రమాదవశాస్తు స్తంభంపై నుంచి కింద పడ్డాడు. దీంతో వెన్నుపూస విరిగి ఉస్మానియా ఆసుపత్రిలో చికిత్స పొందుతుండడంతో ఆదివారం అతన్ని ఆసిఫ్ పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అతని ఆరోగ్యం కుదుటపడే వరకు ప్రభుత్వం వైద్య ఖర్చులు భరించాలని, ప్రతినెలా వేతనం అందివ్వాలని డిమాండ్ చేశారు.

యథేచ్ఛగా చెట్ల నరికివేత



తూప్రాన్ - నర్సాపూర్ రోడ్డు పక్కన నరికివేసిన చెట్లు

శివ్వంపేట(నర్సాపూర్): ఎలాంటి అనుమతులు లేకుండా యథేచ్ఛగా చెట్లను నరికివేశారు. మండల పరిధిలోని చండి గ్రామ శివారులోని తూప్రాన్ - నర్సాపూర్ హైవే పక్కనున్న చెట్లను ఆదివారం యంత్రాల సాయంలో కలప వ్యాపారులు నరికివేశారు. ఓ పక్క ప్రభుత్వం పచ్చదనం పరిరక్షణ కోసం మొక్కలు నాటి వాటి పెంచెందుకు కృషి చేస్తుంటే కలప వ్యాపారులు మాత్రం నిత్యం వాటిని నరికివేసే పనిలో నిమగ్నమయ్యారు. సంబంధిత అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో ఇష్టరాజ్యంగా చెట్లు నరికివేస్తున్నారు. వాల్టా చట్టానికి విరుద్ధంగా వ్యవహరిస్తు పచ్చదనాన్ని కొల్లగొడుతున్న వారిపై చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.

శేరిపల్లిలో నూతన చట్టాలపై అవగాహన



నూతన చట్టాలపై అవగాహన కల్పిస్తున్న పోలీస్ కళాబృందం, సభ్యులు

చిన్నశంకరంపేట(మెదక్): నార్సింగి మండలం శేరిపల్లి గ్రామంలో శనివారం రాత్రి నూతన పోలీస్‌చట్టాలపై పోలీస్ కళాజాత బృందం సభ్యులు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కళాబృందం నాయకులు పాటలతో చట్టాలను వివరించారు. నార్సింగి ఎస్‌ఐ అహ్మద్ మోహినోద్దీన్ నూతన చట్టాలు, నేరాలకు పడే శిక్షలను తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ తాజామాజీ సర్పంచ్ మల్లేశం, నాయకులు రమేశ్, బోయిన రమేశ్, నర్సింలుగౌడ్ శ్రీనివాస్, సత్యనారాయణ పాల్గొన్నారు.

నాయీబ్రాహ్మణ సంఘం అధ్యక్షుడిగా మన్నె యాదగిరి



చిన్నశంకరంపేట(మెదక్): నార్సింగి పట్టణ నాయీబ్రాహ్మణ సేవా సంఘం అధ్యక్షుడిగా మన్నె యాదగిరి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షుడిగా బీమగారి కిషన్, ప్రధాన కార్యదర్శిగా రామారెడ్డి స్వామినాయి, కోశాధికారిగా మన్నె నర్సింలు, కార్యవర్గ సభ్యులుగా సత్తయ్య, పెద్ద రాములు, గణేశ్, తిరుపతి ఎన్నికయ్యారు.

ఎవరికీ పట్టని గ్రంథాలయం

శిథిలావస్థలో భవనం
- విరిగిన కిటికీలు, పెచ్చులూడుతున్న పైకప్పు
- కమ్యూనిటీహాలులో కొనసాగుతున్న లైబ్రరీ
- ఇబ్బందులు పడుతున్న పాఠకులు



కొడిపల్లిలో శిథిలావస్థలో ఉన్న శాఖ గ్రంథాలయం

కౌడిపల్లి(నర్సాపూర్): గ్రంథాలయం సమస్యలకు నిలయంగా మారింది. కమ్యూనిటీ హాల్‌లో ఉన్న భవనం శిథిలావస్థకు చేరింది. లైబ్రరీ కోసం కొత్త భవనం నిర్మించినా.. అందులో పీఆర్ డివిజన్ కార్యాలయం కొనసాగుతోంది. దీంతో పాఠకులకు ఇబ్బందులు పడుతున్నారు.

మండల కేంద్రం కౌడిపల్లిలో శాఖ గ్రంథాలయం ఉంది. మొదట్లో ఇంటిలో ప్రారంభం కాగా 1988 కొత్తకాలనీలోని బీసీ కమ్యూనిటీహాల్‌లో తాత్కలికంగా ఏర్పాటు చేశారు. ఏళ్లు గడుస్తున్నా.. అక్కడే కొనసాగుతుంది. కాగా ప్రస్తుతం లైబ్రరీ కొనసాగుతున్న బీసీ కమ్యూనిటీ భవనం శిథిలావస్థకు చేరింది. ఓవైపు పైకప్పు పెచ్చులూడుతుండగా మరోవైపు కిటికీలు, డోర్లు ధ్వంసమయ్యాయి. అలాగే వర్షం పడితే ఉరుస్తుంది. దీంతో లైబ్రరీలో కూర్చుండటం కూడా ఇబ్బందే. పుస్తకాలకు సైతం తడిసిపోయే సరిస్థితి ఉంది. పాఠకులు కూర్చునేందుకు స్థలం సరిగాలేదు. గతంలో విద్యుత్ సమస్య ఉండగా ఇటీవల సరఫరాను పునరుద్ధరించారు.

8వేల పుస్తకాలు ..

కౌడిపల్లి గ్రంథాలయంలో వివిధ దిన వార పత్రికలతో పాటు కథలు, నాటికలు, పురాణాలు, సైన్స్, పోటీ పరీక్షలు, గణితం, కరెంట్ ఎఫైర్స్, డిక్షనరీ తదితర ఎనిమిది వేలకు పైగా పుస్తకాలు ఉన్నాయి. ఇంకా పుస్తకాల సంఖ్య పెంచుకునే వీలుంది. పాఠకులు ఉన్నారు. కానీ సౌకర్యాలు లేవు. కౌడిపల్లి శాఖ గ్రంథాలయానికి ప్రభుత్వం రూ. 20లక్షలు మంజూరు చేయడంతో 2015లో మండల కార్యాలయం ఆవరణలో అందరికి సౌకర్యంగా ఉంటుందని నిర్మించారు. కాగా అప్పటి ఎమ్మెల్యే (ఇప్పుడు మాజీ) మదన్‌రెడ్డి మండలానికి పంచాయతీరాజ్ పీడివిజన్ కార్యాలయం మంజూరు చేయించి, కొత్తగా నిర్మించిన గ్రంథాలయం భవనంలో పీఆర్ డివిజన్ కార్యాలయాన్ని తాత్కాలికంగా ప్రారంభించారు. ఇంతవరకు పీఆర్ డివిజన్ కార్యాలయం కోసం నూతన భవనం నిర్మించకపోవడంతో అందులోనే కొనసాగుతుంది. దీంతో గ్రంథాలయం శిథిలావస్థలో ఉన్న బీసీ కమ్యూనిటీ భవనంలో కొనసాగుతుండటంతో పాఠకులకు ఇబ్బందులు తీరడంలేదు. అధికారులు స్పందించి లైబ్రరీని సొంతభవనంలోకి మార్చి సమస్య తీర్చాలని విద్యార్థులు, పాఠకులు కోరుతున్నారు.



పెచ్చులూడుతున్న పైకప్పు



విరిగి పోయిన కిటికీలు

అధికారులు తెలియజేశాం



కౌడిపల్లి శాఖ గ్రంథాలయంలో నెలకొన్న సమస్యలను జిల్లా అధికారులకు తెలియజేశాం. శిథిలావస్థలో ఉన్న భవనానికి తాత్కలికంగా మరమ్మతులు చేయాలని కోరాం. కొత్తగా నిర్మించిన లైబ్రరీ భవనంలోకి మారితే సమస్య తీరి, పాఠకులకు మరింత దగ్గర అవుతుంది.

– స్వామి, లైబ్రరీయన్ కౌడిపల్లి

ఆలయాల్లో భక్తుల సందడి

కౌడిపల్లి(నర్సాపూర్): మండలంలోని తునికి నల్ల పోచమ్మ ఆలయంలో ఆదివారం భక్తులు పూజలు చేసి, మొక్కులు తీర్చుకున్నారు. ఉదయం దేవాదాయశాఖ ఇన్‌స్పెక్టర్, ఆలయ ఇన్‌చార్జి ఈఓ రంగారావు, జూనియర్ అసిస్టెంట్ వెంకట్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆలయ అర్చకులు శివ్వప్ప, రాజేశ్ అమ్మవారికి పంచామృతాలతో అభిషేకం నిర్వహించి, ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తులు అమ్మవారిని దర్శించుకొని కుంకుమార్చన చేయించారు. బోనాలు తీసి ఒడిబియ్యం పోశారు. ఆలయంవద్ద డప్పు చప్పుడు శివసత్తుల పూనకాలు అమ్మవారి నామస్మరణతో ఆలయ ప్రాంగణం మారుమోగింది. దీంతోపాటు పలువురు భక్తులు తలనీలాలు సమర్పించి, వాహనాలకు పూజలు చేయించారు. భక్తులకు ఇబ్బందులు లేకుండా అధికారులు ఏర్పాట్లు చేశారు.

చాముండేశ్వరి అమ్మవారికి ప్రత్యేక పూజలు

చిలప్‌చెడ్(నర్సాపూర్): చాముండేశ్వరి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించామని ఆలయ అర్చకుడు తెలిపారు. ఆదివారం చిలప్‌చెడ్ మండలంలోని చిట్కుల్ శివారులో మంజీరా తీరాన వెలసిన చాముండేశ్వరి అమ్మవారికి ప్రీతికరమైన కుంకుమార్చనలు, ప్రత్యేక పూజలు నిర్వహించామన్నారు. అనంతరం భక్తులు అమ్మవారికి ప్రదక్షిణలు చేసి, ఒడిబియ్యంతో మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం భక్తులకు అర్చకులు తీర్థ, ప్రసాదాలు వితరణ చేశారు.



కౌడిపల్లి(నర్సాపూర్): తునికి నల్లపోచమ్మను దర్శించుకుంటున్న భక్తులు

మహంకాళి ఆలయంలో..

చేగుంట(తూప్రాన్): వారాహి దేవి నవరాత్రుల సందర్భంగా చేగుంటలోని మహంకాళి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. వారాహిదేవి నవరాత్రుల రెండోరోజు ఆదివారం సాయంత్రం కిరాత వారాహి దేవి రూపంలో పూజలు చేసి అష్టోత్తరాలను పఠించి భక్తులకు తీర్థ ప్రసాదాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో అర్చకుడు రాఘవేంద్ర శర్మ, ఆలయ నిర్వాహకులు, భక్తులు పాల్గొన్నారు.



చాముండేశ్వరి అమ్మవారి కుంకుమార్చనలో భక్తులు



చేగుంటలో ప్రత్యేక అలంకరణలో మహంకాళి

విద్యార్థులు ఉన్నతంగా ఎదగాలి

హాస్టల్ వార్డెన్ శ్రీనివాస్

గజ్వేల్‌రూరల్: ప్రభుత్వం కల్పిస్తున్న సదుపాయాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకుంటూ ఉన్నత స్థాయికి ఎదగాలని గజ్వేల్ ఎస్టీ హాస్టల్ వార్డెన్ శ్రీనివాస్ పేర్కొన్నారు. ఆదివారం పట్టణంలోని జాలిగామ బైపాస్‌లోగల ఎస్టీ హాస్టల్‌లోని విద్యార్థులకు ప్రభుత్వం పంపిణీ చేసిన దుప్పట్లు, టవల్స్, నోట్ బుక్స్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల సంక్షేమానికి ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందన్నారు. కార్యక్రమంలో హాస్టల్ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

ట్రిపుల్ ఐటీకి సీట్లు సాధిస్తున్న మోడల్‌స్కూల్



జి.సాత్విక



కె.శ్రీనిధి



పి.దీపిక



ఆర్.వర్షిత

చిన్నశంకరంపేట(మెదక్): మోడల్‌స్కూల్ విద్యార్థులు ట్రిపుల్‌ఐటీ సీట్లు సాధిస్తు ప్రతిభను చాటుతున్నారు. చిన్నశంకరంపేట మోడల్‌స్కూల్ నుంచి వరుసగా పదవ తరగతిలో ప్రతిభను చాటుతూ భాసర ట్రిపుల్‌ఐటీ సీట్లను పొందుతున్నారు. వరుసగా పదేళ్లలో ఇప్పటి వరకు 50 మంది విద్యార్థులకు పైగా ట్రిపుల్‌ఐటీ సీట్లను పొందారు. ఈ ఏడు కూడా నలుగురు విద్యార్థులు ట్రిపుల్‌ఐటీ సీట్లు సాధించి సత్తా చాటారు. మోడల్‌స్కూల్ నుంచి జి.సాత్విక, కె.శ్రీనిధి, పి.దీపిక, ఆర్.వర్షిత ట్రిపుల్ ఐటీ సీట్లు పొందారు. దీంతో విద్యార్థులు హర్షం వ్యక్తం చేశారు.

భక్తిమార్గాన్ని అనుసరించాలి

నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతారెడ్డి

శివ్వంపేట(నర్సాపూర్): సమాజంలో ప్రతీ ఒక్కరు భక్తిమార్గాన్ని అనుసరించాలని నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతారెడ్డి అన్నారు. మండల పరిధిలోని గోమారం గ్రామంలో షాపూర్‌నగర్‌కు చెందిన ముద్దపూరం మదన్‌గౌడ్ తన తండ్రి దత్తాత్రేయ జ్ఞాపకార్థం 12 లక్షల సొంత నిధులతో పీర్లను నెలకొల్పేందుకు మసీదు నిర్మించిగా ఆదివారం ఎమ్మెల్యే ప్రారంభించారు. కార్యక్రమంలో మదన్‌గౌడ్ కుటుంబ సభ్యులు యాదమ్మ, మంజుల, శివదత్తు, సవన్విత, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు రమణగౌడ్, నాయకులు కల్లూరి హరికృష్ణ, చంద్రగౌడ్, మన్సూర్, యాదగౌడ్, హన్మంత్‌రెడ్డి, భిక్షపతిరెడ్డి, లక్ష్మణ్, మహేందర్‌రెడ్డి, లాయక్, లక్ష్మన్‌గౌడ్, తదితరులు ఉన్నారు.



మసీదును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సునీతారెడ్డి

ప్రమాదపు మలుపు



చిన్నశంకరంపేట - సూరారం ప్రధాన రహదారిపై ఉన్న మలుపు

చిన్నశంకరంపేట(మెదక్): మండల కేంద్రం నుంచి సూరారం గ్రామానికి వెళ్లే ప్రధాన రహదారిపై మూలమలుపు ప్రమాదాలకు కేంద్ర బిందువుగా మారింది. నూతనంగా నిర్మిస్తున్న పరిశ్రమ దాటగానే వచ్చే మూలమలుపు వద్ద వచ్చే పోయే వాహనాలు దగ్గరకు వచ్చే వరకు కన్పించకపోవడంతో నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయి. వాహనాలు ఢీ కొంటున్న సంఘటనలు ఉన్నాయి. ఆర్‌అండ్‌బీ అధికారులు దృష్టిసారించి మూలమలుపును సరిచేయాలని స్థానికులు కోరుతున్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



నిజాంపేట(మెదక్): ఉపాధ్యాయులతో పూర్వ విద్యార్థులు

నిజాంపేట(మెదక్): మండల కేంద్రంలో రేణుకా గార్డెన్‌లో 1995–96వ సంవత్సరానికి సంబంధించి పూర్వ విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ మేరకు ఆదివారం అలనాటి ఉపాధ్యాయులు రాజిరెడ్డి, మహిపాల్ రెడ్డి, జనార్ధన్‌రెడ్డి, బాలయ్య, సత్యనందం పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు చిన్ననాటి జ్ఞాపకాలు గుర్తు చేసుకొన్నారు. అనంతరం ఉపాధ్యాయులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో అబ్దుల్ అజీజ్, రమేశ్, శ్రీధర్, ప్రభాకర్, తిరుపతి, భూపాల్, రవీందర్, రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

శివ్వంపేట(నర్సాపూర్): మండల కేంద్రం శివ్వంపేట ఉన్నత పాఠశాలలో 1988–89 పదో తరగతి పూర్తి చేసుకున్న బ్యాచ్ మండల పరిధి చండిలో పూర్వ విద్యార్థులు సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా వారి గురువులు రామకృష్ణయ్య, పురుషోత్తమశర్మ, బీరప్పలను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు అంజిరెడ్డి, నారాగౌడ్, అబ్దుల్ అజీజ్, హీరాసింగ్, రజిత, పద్మ, పద్మావతి, తదితరులు పాల్గొన్నారు.



శివ్వంపేటలో పూర్వ విద్యార్థులు

ఘనంగా ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ వేడుకలు



చేగుంట(తూప్రాన్): జెండా ఆవిష్కరణలో ఎమ్మార్పీఎస్ నాయకులు



శివ్వంపేట(నర్సాపూర్): శభాష్‌పల్లిలో జెండాను ఆవిష్కరిస్తున్న నాయకులు

చేగుంట(తూప్రాన్): మండల కేంద్రం చేగుంటలో ఆదివారం ఎమ్మార్పీస్ జెండావిష్కరణ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు చెక్కపల్లి యాదగిరి మాట్లాడుతూ మంద కృష్ణ మాదిగ ఆధ్వర్యంలో ఎమ్మార్పీస్ స్థాపించి 30 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా జెండావిష్కరణ చేస్తున్నట్లు తెలిపారు. మాదిగల హక్కుల సాధన కోసం పోరాటం చేస్తున్న సంఘం కేవలం ఎమ్మార్పీస్ మాత్రమే అన్నారు. ఈ కార్యక్రమంలో మండల శాఖ అధ్యక్షుడు కొలుపుల రామస్వామి, మద్దూరి కృష్ణ, ప ట్నంబాలనర్సింలు, బక్క సాయిబాబా, రాములు, వెంకన్న, శ్రీను, మహేదందర్, స్వామి, శేఖులు, పరమేశ్, భిక్షపతి తదితరులు పాల్గొన్నారు.

వెల్దుర్తి(తూప్రాన్): మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి ఆవిర్భావ దినోత్సవ వేడుకలతో పాటు ఆ సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణమాదిగ జన్మదిన వేడుకలను మాసాయిపేటలో ఘనంగా నిర్వహించారు. సంఘం సీనియర్ జాతీయ నాయకులు మాసాయిపేట యాదగిరిమాదిగ ఆధ్వర్యంలో జెండా ఎగురవేసి, కేక్ కట్‌చేసి, మిఠాయిలు పంచిపెట్టారు. ఆత్మ గౌరవం, హక్కులు, రాజ్యాధికారమే లక్ష్యంగా చేసుకొని అన్ని కులసంఘాలకు ప్రజా సంఘాలకు ఎమ్మార్పీఎస్ ఆదర్శంగా నిలిచిందని యాదగిరి అన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ సిద్ధిరాములుగౌడ్, ఎమ్మార్పీఎస్ నాయకులు పాల్గొన్నారు.

కొల్చారం(నర్సాపూర్): మండలంలోని కిష్టాపూర్ గ్రామంలో ఎమ్మార్పీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు ప్రవీణ్ కుమార్ ఆధ్వర్యంలో ఎమ్మార్పీఎస్ జెండాను ఆవిష్కరించారు. అనంతరం మందకృష్ణ మాదిగ 60వ జన్మదిన వేడుకల సందర్భంగా కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో కిష్టాపూర్ మాజీ సర్పంచ్ గోదావరి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మల్లేశం గౌడ్, పోలీస్ సూరి, శ్రీశైలం, కిష్టాపూర్ సీనియర్ నాయకులు బాలయ్య, సొసైటీ డైరెక్టర్ పోచయ్య, నాగరాజు, షేకులు, దేవయ్య, నవీన్, సుధాకర్, కరుణాకర్, ఏగొండ, ప్రేమ్ కుమార్, భాను, సురేష్, నాగరాజు, సంతు, రాజేష్ గౌడ్, పోచయ్య తదితరులు పాల్గొన్నారు.

శివ్వంపేట(నర్సాపూర్): మండల పరిధిలోని శభాష్‌పల్లి గ్రామంలో ఎమ్మార్పీఎస్ నాయకులు లక్ష్మణ్, యాదగిరి, ఏల్లేశ్ తదితరులు ఎమ్మార్పీఎస్ జెండా ఆవిష్కరించారు. మాదిగ రిజర్వేషన్ జరిగేంత వరకు ఉద్యమిస్తామని నాయకులు అన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ **నివాళి**

మెదక్‌జోన్: ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ పీసీసీ అధ్యక్షుడు, దివంగత శ్రీనివాస్‌కు మెదక్ మాజీ ఎమ్మెల్యే శశిధర్‌రెడ్డి ఆదివారం నివాళులర్పించారు. ప్రత్యేక రాష్ట్రం కోసం శ్రీనివాస్ చేసిన సేవలు మరువలేనివని ఆయన కొనియాడారు.

◆ **నేడు బీజేపీ కృతజ్ఞత సభ**

నర్సాపూర్: పట్టణంలో ఈనెల 8న బీజేపీ కృతజ్ఞత సభ ఏర్పాటు చేశామని పార్టీ నియోజకవర్గ కన్వీనర్ రమణరావు తెలిపారు. ఈ సభలో మెదక్ ఎంపీ రఘునందన్‌రావు ముఖ్య అతిథిగా పాల్గొంటారని ఆయన చెప్పారు. నియోజకవర్గంలోని పార్టీ నాయకులు, కార్యకర్తలు సోమవారం ఉదయం పది గంటలకు పట్టణంలోని సాయిక్రిష్ణ ఫంక్షన్ హాల్‌లో జరిగే సభకు రావాలని రమణరావు కోరారు.

◆ **బోనాల ఉత్సవాలపై సమీక్ష**



తూప్రాన్: మున్సిపల్ కేంద్రంలో ఈనెల 28 నుంచి 30 వరకు మహంకాళి బోనాల ఉత్సవాలు నిర్వహించేందుకు మున్సిపల్ చైర్ పర్సన్ మామిళ్ల జ్యోతికృష్ణ ఆధ్వర్యంలో పట్టణ పుర ప్రముఖులు ఆదివారం సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా ఉత్సవాల ఏర్పాట్లపై చర్చించారు. 28న బండ్లు, బోనాలు, 29న గావు, రంగం, 30న ఒగ్గుకథ నిర్వహించనున్నారు. ఈ సమావేశంలో వైస్ చైర్మన్ నందాల శ్రీనివాస్, పీఏసీఎస్ వైస్ చైర్మన్ దీపక్‌రెడ్డి, పురపాలక సంఘం కౌన్సిలర్లు రవీంద్ర గుప్తా, శ్రీశైలం గౌడ్, రఘుపతి నర్సోజి, సత్య లింగం, వెంకటేశం, మాజీ సర్పంచ్ శివమ్మ, పెద్దలు, కుల సంఘాలు, ఆయా పార్టీల నాయకులు పాల్గొన్నారు.

పోలీసుల అదుపులో చోరీ నిందితుడు?

శివ్వంపేట(నర్సాపూర్): మండల పరిధి సికింద్లాపూర్ గ్రామంలో పట్టపగలు ఇంట్లో చోరీకి పాల్పడ్డ నిందితుడిని పోలీసులు గుర్తించారు. బుధవారం గ్రామానికి చెందిన దొంతికె మహేశ్ ఇంట్లో గుర్తు తెలియని వ్యక్తి 9 తులాల బంగారం, రూ.20 వేల నగదు ఎత్తుకెళ్లాడు. గ్రామంలోని సీసీ కెమెరాలను పరిశీలించగా మహేశ్‌కు చెందిన దూరపు బంధువుగా గుర్తించి బాధితులు, గ్రామస్తులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. చోరీ చేసిన వ్యక్తి జీడిమెట్ల ప్రాంతంలో నివాసం ఉంటుండంతో పోలీసులు నిఘా వేసి అతడిని పట్టుకున్నట్లు సమాచారం. ఈ విషయం గురించి ఎస్‌ఐ మహిపాల్‌రెడ్డిని వివరణ కోరగా సికింద్లాపూర్ చోరీకి పాల్పడిన వ్యక్తిని అదుపులోకి తీసుకోలేదని దర్యాప్తు కొనసాగుతుందని తెలిపారు.

దొంతిలో ధ్వంసమైన అండర్ డ్రైనేజీ

శివ్వంపేట(నర్సాపూర్): మండల పరిధిలోని దొంతి గ్రామంలో నిర్మించిన అండర్ డ్రైనేజీ పనులు నాసిరకంగా చేపట్టడంతో మున్నాళ్ల ముచ్చటగా మారింది. 8 నెలల క్రితం గ్రామంలోని 7వ వార్డు చేపట్టిన అండర్‌గ్రౌండ్ మురికికాల్వ మ్యాన్‌హోల్, పైపులు ధ్వంసం కావడంతో మురికినీరు రోడ్డుపై పారుతుందని కాలనీ వాసులు ఆరోపించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అండర్ డ్రైనేజీ పనులు నిర్వహించిన సదరు గుత్తేదారు నాణ్యత ప్రమాణాలు పాటించకుండా ఇష్టరాజ్యంగా చేపట్టడం వల్ల పాడైపోయినట్లు చెప్పారు. పంచాయతీరాజ్ శాఖ అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో పనుల్లో నాణ్యత కొరవడిందన్నారు. ఈ విషయం గురించి పీఆర్ ఏఈ భాస్కర్‌రావు వివరణ కోరగా.. తను దీర్ఘకాలిక సెలవులో ఉన్నానన్నారు. సంబంధిత శాఖ ఉన్నతాధికారులు స్పందించి నాసిరకంగా నిర్మించిన అండర్ డ్రైనేజీ పనులు పరిశీలించి చర్యలు తీసుకోవాలి.



పాడైపోయిన అండర్‌గ్రౌండ్ మురుగుకాల్వ